

రేషన్ కార్డులకు గ్రీన్‌సిగ్నల్

- అక్టోబరు 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- డిజిటల్ కార్డుల పంపిణీకి కసరత్తు
- ఆరేళ్లకు మళ్లీ ప్రక్రియ
- జిల్లాలో 21వేల పెండింగ్ దరఖాస్తులు



ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24: డిజిటల్ రేషన్‌కార్డుల ప్రక్రియ కు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటితోపాటు కొత్తవి అందించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రేషన్ కార్డుల కోసం జిల్లాలో ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న వారిలో ఆశలు చిగురించాయి. గత ప్రభుత్వ హయాం నుంచి ప్రస్తుత ప్రభుత్వ వరకు రేషన్ కార్డులపై ప్రకటనలు చేసిన ప్రతీసారి జిల్లాలో పెండింగ్ దరఖాస్తుదారులు, కొత్తగా అర్హత ఉన్న వారు ఆశగా ఎదురుచూడడం, నోటిఫికేషన్ రాక పోవడంతో నిరాశ చెందడం మామూలుగా మారి పోయింది. మరోవైపు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటోంది. దీంతో వివిధ పథకాలను కోల్పోయే పరిస్థితి వచ్చింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలపై దరఖాస్తులు తీసుకున్నా రేషన్‌కార్డు కాలం లేకపోవడంతో తెల్ల కాగితంపై దరఖాస్తులు స్వీకరించారు.

కార్డులపై అయోమయం నెలకొన్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేషన్ కార్డుల జారీకి విధి విధానాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయించారు. దీంతో దాదాపు ఆరేళ్లుగా ఎదురు చూస్తున్న కుటుంబాల నిరీక్షణ తొలుగుతుందని భావిస్తున్నారు. రేషన్ కార్డుల విధి విధానాలు ఎలా ఉండ బోతున్నాయనే దానిపై కూడా ఆసక్తి నెలకొంది. కొత్తగా జారీ చేసే కార్డులతోపాటు పాత వాటి స్థానంలో డిజిటల్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. డిజిటల్ రేషన్ కార్డులు, డిజిటల్‌కార్డు ప్రభుత్వ పథకాలకు ప్రామాణికంగా మారనుంది.

రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు పొందడానికి కూడా వీలు ఉంటుంది. రేషన్ అవసరం లేనివారికి హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డులు విడివిడిగా అందించడానికి నిర్ణయించారని సమాచారం. నిబంధనలు ఎలా ఉన్నా ఆదాయ పరిమితి ఎంత వరకు విధించే అవకాశం ఉంటుందన్నదానిపై సందిగ్ధం నెలకొందని చెబుతున్నారు.

314 రేషన్ దుకాణాలు

జిల్లాలో 314 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో వివిధ రకాల 1,3 9,761 కార్డులున్నాయి. ప్రతి నెలా 27,0 15 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రజా పంపిణీ ద్వారా అందజేస్తున్నారు. రేషన్ కార్డుల కోసం, కుటుంబ సభ్యుల వివరాలను చేర్పించేందుకు 17,044, ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం 21వేల దరఖాస్తులు వచ్చాయి. ఆరు గ్యారంటీల్లో రేషన్ కార్డు ఆప్షన్ లేకపోయినా విడిగా దరఖాస్తులను స్వీకరించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో అమ్మహస్తం పథకం కింద రూ.185 కే తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. బియ్యంతో పాటు కందిపప్పు, చింతపండు, గోధు మలు, గోధుమ పిండి,కారం పొడి, నూనె వంటి సరుకులు పంపిణీ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెల్లరేషన్ కార్డులను ఆహార భద్రత కార్డులుగా మార్చి కేవలం బియ్యానికే పరిమితం చేశారు. కాగా రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో ఆరోగ్య సమస్య వస్తే కలెక్టరేట్‌లో ఆరోగ్య శ్రీ ట్రస్ట్ ద్వారా తాత్కాలికంగా ఓ కార్డును జారీ చేసేవారు. ఇలా ఇబ్బందులు పడుతున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్డుల జారీకి నిర్ణయించినా పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో ప్రక్రియ మొదలు కాలేదు. తాజాగా మళ్లీ సబ్ కమిటీ వేసి త్వరలోనే రేషన్ కార్డులు అందిస్తా మని ప్రకటించడంతో జిల్లాలో అర్హులైన దరఖాస్తుదారుల్లో ఆశలు మొదలయ్యాయి.

మెరుగైన విద్యను అందించాలి



ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ కుష్బుగుప్తా

వాంకిడి, సెప్టెంబరు 24: ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఎడ్లబండిపై వాగులు దాటుకుంటూ మండలంలోని వెల్గి ఆశ్రమ పాఠశాలను పీవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు వంటగది, స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహ పరిసరాల్లో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుమరంభీం వర్ధంతిని విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24: జిల్లాలోని జోడేఘాట్‌లో అక్టోబరు 17న నిర్వహించనున్న కుమరంభీం వర్ధంతి, దర్బార్ కార్యక్రమాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారంఅదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఐటీడీఏ పీవో కుష్బు గుప్తా, కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధ శుక్లతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్ధంతి వేడుకలతో పాటు దర్బార్‌కు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించాల న్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు దృష్టి సారించాలన్నారు. మిషన్ భగీరథ శాఖల సమన్వయంతో ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డివిజనల్ స్థాయి పోటీలు ప్రారంభం

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24: జిల్లా కేంద్రంలోని ఆశ్రమ క్రీడా పాఠశాలలో డివిజనల్ స్థాయి పోటీలను ఏటీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోటీలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందులో గెలుపొందిన వారు ఆసిఫాబాద్‌లో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, క్యారమ్, చెస్,అథ్లెటిక్స్ ఆర్చేరీ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీఎంవో ఉద్ధవ్, జీసీడీవో శకుంతల, ప్రధానోపాధ్యాయుడు జంగు, వ్యాయమ ఉపాధ్యాయుడు మదుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి అజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్‌లతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు చేపడుతున్నా మన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయరాజ్, సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యుల రాజీనామా

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24: జిల్లా పీఆర్టీయూ సభ్యులు తమసభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు పలువురు ప్రకటించారు. లుంబినీ దీక్ష భూమిలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల కాగజ్ నగర్‌లో జరిగిన పీఆర్టీయూ జిల్లా సంఘం ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వారికి ప్రాధాన్యం ఇవ్వ లేదన్నారు. ఒకే ప్రాంతానికి కీలక పదవులు ఇవ్వడం శోచనీయమని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు దత్తు, రవీందర్, రోహిదవ్, సురేఖ, లక్ష్మీకాంత్, రవీందర్, శివప్రసాద్, రవితేజ, వినోద్‌కుమార్, యువరాజ్, మోహన్, వసంత్ పాల్గొన్నారు.

కొసర, తుంపల్లి గ్రామాల పరిశీలిన

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 24: మండలంలోని కొసర, తుంపల్లి గ్రామ పంచయతీలను కేంద్రజలశక్తి అభియాన్ టీం సభ్యులు కృష్ణకుమార్‌పిళ్లే మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కోసర గ్రామ పంచాయతీలో అమృత్‌సరోవర్ ఊటకుంట పని పూర్తవడంతో రైతులకు కలిగిన ఉపయోగం తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే తుం పల్లి గ్రామ పంచాయతీలో పల్లె ప్రకృతి వనం సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారాం, ఆంజనేయులు, ఎంపీడీవో, ఏపీవో చంద్రశేఖర్‌లు ఉన్నారు.

వందశాతం అక్షరాస్యత సాధించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24: జిల్లాలో వందశాతం అక్షరాస్యత సాధించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనభారత అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లను నియమించుకోవవాలని, డిగ్రీ విద్యార్థులను వాలంటీర్లుగా నియమించి నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. మహిళా సంఘాలలో నిరక్షరాస్యులను గుర్తించి విద్యాబోధన చేసే విదంగా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. అంగన్ వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, సహాయకులు తమ పరిధిలోని నిరక్షరాస్యులను గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలని, గ్రామాలు, మున్సిపాలిటీల నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విధంగా సెర్ప్, మెప్మా సబ్బంది కృషి చేయాలని తెలిపారు. గ్రామ స్థాయిలో వాలంటీర్లను గుర్తించి వారి ద్వారా మ్యాచింగ్, బ్యాచింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి ఉదయబాబు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, లైజనింగ్ అధికారి నాగరాజు,సైన్స్ అధికారి మధుకర్, జిల్లా విద్యా, ఇంటర్మీడియట్ విద్య, ఉన్నత విద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ, వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్, సెర్ప్, మెప్మా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ఓటరు జాబితా ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటింటా ఓటరు జాబితా ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సిసుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి మంగళవారం ఇతర అదనపు ఎన్నికల అధికారులతో కలిసి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సబ్ కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, ఆర్డీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటరు జాబితా రూపకల్పనలో బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలో ఇంటింటా సర్వే ప్రక్రియ 100 శాతం పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ, అదనపు పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల చిరునామా, ప్రదేశాల మార్పుపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటరు జాబితా తయారీ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు అంవాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా కృషి చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమావేశ మందిరంలో వీసీలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల చివరిలోగా జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఓటరు జాబితా బూత్ స్థాయి అధికారుల సమన్వయంతో ఇంటింటా సర్వే ప్రక్రియ పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సర్వేలో భాగంగా తాళం వేసి ఉన్న ఇంటికి బూత్ స్థాయి అధికారులురెండో సారి వెళ్లి సర్వే చేసే విధంగా పర్యవేక్షిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, చిరునామా, ప్రదేశాల మార్పుపై భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మధుకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ప్రతీ వర్షపు చినుకు విలువైనదే

- జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి కృష్ణకుమార్

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24: ప్రతీ వర్షపు చినుకు విలువైనదని కేంద్ర ప్రభుత్వ జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి పి కృష్ణకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం కలెక్టర్, జలశక్తి అభియాన్ చైర్మన్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, టెక్నికల్ అధికారి వెంకటగిరిలతో కలిసి జలశక్తి అభియాన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ నోడల్ అధికారి మాట్లాడుతూ జిల్లాలో నీటి రక్షణపై తగు చర్యలు తీసుకోవాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును రక్షించి భూగర్భ జల మట్టాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి వర్షపు చినుకు భూమిలో ఇంకిపోయేలా చర్యలు చేపట్టాలని, చెక్ డ్యాంలు, కుంటల నిర్మాణం, కమ్యూనిటీ సోక్ పీట్స్ ఇంకుడు గుంతల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూగర్భ జలా మట్టాన్ని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాని తెలిపారు. చెక్ డ్యాంల నిర్మాణాలను ఈజీఎస్ పథకంలో భాగంగా రైతులు వ్యవసాయ చేనులలో, ప్రభుత్వ భూములలో చిన్న చిన్న కుంటల నిర్మాణం, ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కమ్యూనిటీ సోక్ పీట్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో 1.23 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయని, వర్షపు నీటి వాటర్ హార్వెస్టింగ్, వాటర్ కన్జర్వేషన్ కొరకు 2713 పనులను ప్రారంభించి 2134 పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వర్షపు నీటి రక్షణపై అవగాహన కార్యక్రమాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వర్షపు నీటి రక్షణ అంశాన్ని వివరించారు. అధికారులు సమన్వయంతో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, డీపీవో భిక్షపతి, డీఎంఅండ్‌హెచ్ఓ తుకారాం, ఈఈలు వెంకటపతి, గుణవంతరావు, ప్రభాకర్, ఉద్యావన అధికారి వెంకటేశ్వర్, వాటర్ షెడ్ ప్రాజెక్టు అధికారి ఆంజనేయులు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, అటవీ, జిల్లా పరిషత్, నీటిపారుదల, వ్యవసాయ, ఉద్యానవన, విద్య, పంచాయతీ, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, భూగర్భజలవనరులు, సంక్షేమ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటా ఇప్పించాం

రెబ్బెన, సెప్టెంబరు 24: సింగరేణిలో వచ్చిన లాభాల వాటాను కార్మికులకు 33 శాతం ఇప్పించిన ఘతన కేవలం ఏఐటీయూసీదేనని గోలేటి బ్రాంచ్ సెక్రటరీ తిరుపతి అన్నారు. గోలేటి ఏరియాలో మంగళవారం వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన 33 శాతాన్ని ప్రభుత్వంతో రాష్ట్ర సంఘం ప్రాతినిధ్యం చేసి కార్మికులకు 33 శాతం వాటాను ఇప్పించినట్టు తెలిపారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.5వేలు ఇప్పించినట్టు వివరించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు బయ్య మొగిలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్, రాజేశం, ఫిట్ సెక్రటరీ అశోక్, వసీం, వీరు, రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.



రిటైర్డు కార్మికులకు పింఛన్ పెంచాలి



నివాదాలు చేస్తున్న రిటైర్డు కార్మికులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 24: సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటుపడి ఉద్యోగ విరమణ పొందిన తనకు 11వ వేజ్‌బోర్డు పింఛన్ పెంపుదల అమలు చేయాలని రిటైర్డు కార్మికులు వాసాల శంకర్, కంబాల రాజనర్సులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన తర్వాత బెనిఫిట్స్ వెంటనే ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత 2 నెలల్లో క్వార్ట ర్లను అప్పగిస్తేనే గ్రాట్యూటీ , ఇతర బెనిఫిట్స్ అందిస్తున్నారని , కానీ కార్మికేతరులు క్వార్టర్లను కబ్జాచేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల క్వార్టర్లను వారికే కేటాయించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. మరికొద్ది రోజుల్లో మందర్రిలో సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్జన్, దాసరి ఎల్లారం, ఏల్పుల వెంకటి, ఆసం కొమురయ్య, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరు సరికాదు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24 : గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల తీరుతో కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి 4,701 కోట్ల రూపాయలు నికర లాభాలు సాధించిందని తెలిపారు. అందులో 2,289 కోట్ల రూపాయలు అభివృద్ధి పేరిట పక్కబెట్టారని, మిగిలిన 2412 కోట్ల రూపాయలను అర్జిత లాభాలుగా ప్రకటిస్తూ 33శాతం బోనస్‌గా ప్రకటించారని పేర్కొన్నారు. ఈ విషయం తెలిసినా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ మిన్నకుండపోవడం కార్మికులు గమనించాలన్నారు. వారి వైఖరిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా 4701 కోట్ల రూపాయలను ఆర్జిత లాభాలుగా ప్రకటించి 1,551 కోట్ల రూపాయలు (33 శాతం) కార్మికులకు పంచాలని కోరారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛత ప్రత్యేక కార్యక్రమం 4.0ను సీసీసీ టౌన్‌షిప్ మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ ప్రతి యేటా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా సీసీసీ టౌన్‌షిప్‌లోని మైదానంలో ఉన్న చెత్తను ఏరివేసినట్లు చెప్పారు. ఇళ్లు, కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచడం ఎవరికి వారు తమ బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎస్ సత్యనారాయణ, ఏఐటీయూసీ సహాయ బ్రాంచ్ కార్యదర్శి కొమురయ్య, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్, సివిల్ ఇంజనీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రెబ్బెన: సింగరేణిలో స్వచ్ఛత కార్యక్రమంలో అగ్రస్థానంలో ఉండాలని ఎస్ఓ టు జీఎం రాజమల్లు తెలిపారు. రామాలయ ఆవరణలో స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, సివిల్(ఎస్ఈ) భాష, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఎన్విరాన్మెంటు అధికారి రమేశ్ పాల్గొన్నారు.



చెత్తాచెదారం తొలగిస్తున్న అధికారులు

కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం

జైపూర్, సెప్టెంబరు 24: ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో సింగరేణి యాజమాన్యం విఫలమైందని ఎస్టీపీపీ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి దుస్సభాస్కర్ అన్నారు. డిప్యూటీ సెంట్రల్‌లేబర్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం యూనియన్ ప్రతినిధులతో కలిసి పవర్ మేక్ సంస్థతో చర్చల్లో పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలని పలు దఫాలుగా చర్చల్లో పాల్గొన్నా కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. సీఎండీ, డైరెక్టర్‌లతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరిస్తామని డిప్యూటీ సెంట్రల్ లేబర్‌కమిషనర్ చర్చించినప్ప టికీ పట్టించుకోలేదన్నారు. అందులో భాగంగా సింగరేణి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ చిలకాని వెంకటేశ్వర్లు, నాయకులు బోడకుంట శ్రీధర్, కళ్యాణం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల వాటాపై తప్పుడు ప్రచారం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24: లాభాల వాటాపై బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ యూనియన్ తప్పుడు ప్రచారాలు చేయడం తగదని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. ఎస్ఆర్‌పీ 3 గనిపై మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, టీబీజీకేఎస్ యూనియన్ పదేళ్ల పాటు అధికారంలో ఉండి కార్మికులకు ఒరగబెట్టింది ఏమిటని ఆయన ప్రశ్నించారు. 30 వేల కోట్ల రూపాయలు విద్యుత్ సంస్థల నుంచి రాకుండా చేసిన ఘనత బీఆర్ఎస్‌ది కాదా అన్నారు. 2014లో 65 వేల మంది కార్మికులుంటే వారిని 40 వేల మందికి తగ్గించిన ఘనత టీబీజీకేఎస్‌కు దక్కుతుందన్నారు. డీఎంఎఫ్‌టీ, సీఎస్ఆర్ నిధులు స్థానికంగా వినియోగించాల్సి ఉండగా, ఇతర జిల్లాలకు తరలించారని ఎద్దేవా చేశారు. పది కొత్త గనులు, మారుపేర్ల మార్పిడి, ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్, నూతనంగా పది వేల క్వార్టర్ల నిర్మాణం వంటి హామీలిచ్చి ఒక్కటి కూడా నెరవేర్చకుండా కార్మికులను మోసగించారన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే అలవాటు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జాతీయ సమితి నాయకుడు సీహెచ్ భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, ఉప ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, వీరమల్లు, శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, నీలం సదయ్య, వెంగళ కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

టింబర్‌యార్డు కార్మికులకు న్యాయం చేస్తాం

▸▸ హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24: టింబర్‌యార్డు కార్మికులకు న్యాయం చేస్తామని హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య అన్నారు శ్రీరాంపూర్ టింబర్ యార్డు కార్మికులతో మంగళవారం వారు సమావేశమయ్యారు. 30 ఏళ్లుగా టింబర్ యార్డులో పనిచేస్తున్న కార్మికులకు వేతన నష్టం జరుగుతోందన్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్ సంఘాలు టింబర్‌యార్డు కార్మికుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని చెప్పారు. తమ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ చొరవచూపి ఆర్ఎల్‌సీ వద్ద ఫిర్యాదు నమోదు చేశారన్నారు. త్వరలో కార్మికులకు రావాల్సిన వేతనాలు నయాపైసతో సహా వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యద ర్శి వి అనిల్‌రెడ్డి, నాయకులు పల్లె క్రాంతికుమార్, చెవుల శ్రీనివాస్, రాధాకృష్ణ, పందుల ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను మోసగిస్తున్న ప్రభుత్వం

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24: అంకెలగారడీతో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కార్మికులను మోసగిస్తోందని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ రావు అన్నారు. లాభాల వాటాలో జరిగిన మోసాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సీసీసీలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద చేపట్టిన ధర్నాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 4,701 కోట్ల రూపాయలు లాభాలుగా వస్తే అందులో 16.9 శాతం మాత్రమే కార్మికులకు ఇవ్వనున్నట్లు ప్రకటించి, మిగిలిన డబ్బును సంస్థ కోసం వినియోగిస్తామని చెప్పడం దారుణమన్నారు. వచ్చిన లాభాలలో 33 శాతం ఇస్తే 1551.33 కోట్ల రూపాయలు కార్మికులకు అందుతాయని చెప్పారు. ఈ విషయం తెలిసినా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు నోరు విప్పకపోవడం సరికాదన్నారు. వెంటనే ప్రభుత్వం, యాజమాన్యం స్పందించి కార్మికులకు పూర్తిస్థాయిలో లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీఆర్ఎస్ నస్పూర్ మండల అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకే ఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, నాయకులు గోపియా నాయక్, సాదుల భాస్కర్, గడ్డం సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

ముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 24 : సింగరేణి కార్మికులకు మెరుగైన లాభాల వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను టీబీజీకేఎస్ నాయకులు దహనం చేశారు. అంతకుముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఓ.రాజశేఖర్, జె.రవీందర్‌లు మాట్లాడుతూ వాస్తవ లాభాలు 4701 కోట్లు వెల్లడించారని, మొత్తం చెల్లించకుండా 33 శాతం కింద 796 కోట్లు చెల్లిస్తున్నారని ఇది సరైంది కాదన్నారు. ముందుగా ప్రకటించిన విధంగా 4701 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని, కార్మికులు దీన్ని వ్యతిరేకించాలన్నారు. వీరారెడ్డి, అశోక్, బోరిగం వెంకటేష్, తిరుపతి, మల్లేష్, శ్రీనివాస్, మల్లేష్, శివ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చెన్నూరు, సెప్టెంబరు 24: చట్టాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెన్నూరు మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి పార్వతపు రవి కోరారు. మంగళవారం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరగాళ్లు పెరిగిపోతున్నారని, ప్రతీ ఒక్కరు ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయవాదులు వివిధ అంశాలపై వివరించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రమేష్ గిల్డా, ఎస్ఐ శ్వేత, న్యాయవాదులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్ సమావేశం

నస్పూర్, సెప్టెంబరు 24: తెలుగు భాషా ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగింది. ప్రధానోపాధ్యాయుడు దామోదర్‌రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా పాఠశాలల ఫలితాలను డీఆర్‌పీలు రవీందర్, వేణుగోపాల్ రావులు సమీక్షించారు. అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా వెనుకబడిన విద్యార్థుల సులభ అంశాలను డీఆర్‌పీ సత్యనారాయణ వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ధరణి సత్తయ్యను సన్మానించారు. నస్పూర్, జైపూర్, భీమారం, మంచిర్యాల, హాజీపూర్ మండలాలకు చెందిన తెలుగు భాషా ఉపాధ్యాయులు 44 మంది హాజరయ్యారు.

విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం

నెన్నెల, సెప్టెంబరు 24: రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థి సయ్యద్ అబ్దుల్ రహెమాన్‌ను మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ సన్మానించారు. క్రీడలకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గట్టు మల్లేష్, హరీష్‌గౌడ్, శ్రీనివాస్, ఉన్నారు.

ఇసుక రీచ్ సమస్యను పరిష్కరించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 24: ఖర్జీలోని ఇసుక రీచ్ సమస్యను పరిష్కరించాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కొన్ని నెలలుగా ఖర్జీ ఇసుక రీచ్‌కు రహదారి సౌకర్యం లేకపోవడంతో ట్రాక్టర్లు నడవక ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్మికులు ఆందోళన చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. మంచిర్యాల నుంచి ఇసుక తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక సమస్య పరిష్కారం కోసం ప్రత్యామ్నాయ మార్గం చూపించాలన్నారు. మణిరాంసింగ్, చాంద్‌పాషా పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుమ్మరికుంట సర్వే

చెన్నూరు, సెప్టెంబరు 24: కుమ్మరికుంట చెరువు సర్వే కొనసాగుతోంది. మంగళవారం జిల్లా ల్యాండ్ సర్వేయర్ శ్రీనివాస్, తహసీల్దార్ మల్లికార్జున్, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్ నేతృత్వంలో పాయింట్ టూ పాయింట్ సర్వే జరుపుతున్నట్లు వారు పేర్కొన్నారు. పట్టణ నడిబొడ్డున సర్వే కొనసాగుతుండడంతో ఆ ప్రాంత వాసుల్లో ఉత్కంఠ నెలకొంది. శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూమిలో నిర్మాణాలు చేపట్టిన వారు ఆందోళన చెందుతున్నారు. చెరువు శిఖం భూమి హద్దులను గుర్తించేందుకు మరో రెండు రోజులు సమయం పడుతుందని అధికారులు పేర్కొన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

బెల్లంపల్లిరూరల్, సెప్టెంబరు 24: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లక్షెట్టిపేటలో సోమవారం నిర్వహించిన అండర్ 19 ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్, కుస్తీ పోటీల్లో మహాత్మాజ్యోతిబాపూలే సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన సాయిప్రియ వాలీబాల్, మైత్రి, శరణ్యలు కుస్తీ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. మంగళవారం పాఠశాలలో అభినందించారు. పీడీ శోభారాణి, పీఈటీ మమత పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులు దహనం

గర్మిళ్ల, సెప్టెంబరు 24: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులను మంగళవారం సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు బస్టాండ్ ఎదుట దహనం చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జైపాల్‌సింగ్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ గతేడాది ప్రధాని మోదీ కార్మిక చట్టాలను సవరించి కార్మికులకు అన్యాయం చేశారన్నారు. సుధాకర్, చంద్రయ్య, అరుణ, అంజన్న, సతీష్,చిన్నన్న,సురేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

1న మెగా రక్తదాన శిబిరం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 24: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320జీ ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీ జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఎం కన్వెన్షన్ హాల్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి, సత్యపాల్ రెడ్డి, నాగేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఆర్ఎంపీ వైద్యం వికటించేనని కుటుంబ సభ్యుల ఆరోపణ


మధుకర్ (ఫైల్)

దండేపల్లి, సెప్టెంబరు 24: ఆర్ఎంపీ వైద్యం వికటించి చికిత్స పొందు తు యువకుడు మృతి చెందిన సంఘటన కొర్విచెల్మ గ్రామ పంచాయతీ పరిధి కొత్తకొమ్ముగూడెంలో చోటుచేసుకుంది. బత్తుల మధుకర్(26) అనే యువకుడికి ఈనెల 18న జ్వరం రావడంతో కన్నెపల్లికి చెందిన ఆర్ఎంపీ శ్రీనివాస్ ఇంజక్షన్లు ఇచ్చాడు. కొద్దిసేపటికి మధుకర్ అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు, అక్కడి నుంచి సికింద్రాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 21న మధుకర్ పరిస్థితి విషమించి బ్రెయిన్‌డెడ్ అయిందని పేర్కొన్నారు. వెంటిలెటర్‌పై చికిత్స అందిస్తుండగా ఖర్చులు భరించలేక మంచిర్యాల ఆసుపత్రికి తీసుకవచ్చారు. మంగళవారం తెల్లవారుజామున మధుకర్ మృతిచెందాడు. మధుకర్ మృతికి ఆర్ఎంపీ వైద్యమే కారణమని కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడి తండ్రి బత్తుల రాజలిం గు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రెండు గ్రూప్‌ల మధ్య ఘర్షణ

మంచిర్యాల అర్బన్, సెప్టెంబరు 24: పట్టణంలోని బైపాస్ రోడ్డులో సోమవారం అర్ధరాత్రి రెండు గ్రూప్‌ల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురికి గాయాలైనట్లు పట్టణ సీఐ బన్సీలాల్ తెలిపారు. సంజీవ్ అనే అతడిపై పాతకక్షలతో రుద్రతేజ, జ్ఞానేశ్వర్‌లు మరి కొందరితో కలిసి కత్తులు, కర్రలతో దాడికి యత్నించారు. సంజీవ్, అతని వెంట ఉన్న మరో వ్యక్తి ప్రతిఘటించి ఎదురు దాడికి దిగారు. ఈ క్రమంలో రుద్రతేజ, జ్ఞానేశ్వర్ వెంట ఉన్న వారు పారిపోయారన్నారు. పరస్పర దాడిలో నలుగురు వ్యక్తులు గాయాలపాలయ్యారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెన్నూరులో కుక్కల హతం

చెన్నూరు, సెప్టెంబరు 24: పట్టణంలోని వివిధ కాలనీల్లో కుక్కలను హతమార్చడం సంచలనం రేపింది. మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనగిల్డా భర్త రాంలాల్‌గిల్డా ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో సఫాయిగా పనిచేస్తున్న బాపు అతని స్నేహితుడితో కుక్కలను హతమార్చాడు. చైర్‌పర్సన్ భర్త రాంలాల్ గిల్డా పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని హతమార్చాలని కోరడంతో రాత్రి సమయంలో మిత్రుడి సహాయంతో బరిసెతో పొడిచి చంపినట్లు సఫాయి బాపు పేర్కొన్నాడు. దాదాపు 5 నుంచి 6 కుక్కలను హతమార్చగా మంగళవారం ఉదయం చెత్త బండిలో పడేసి డంపింగ్‌యార్డుకు తరలించినట్లు బాపు తెలిపాడు. కుక్కలను హతమార్చేందుకు పాల్పడిన చైర్‌పర్సన్ భర్త రాంలాల్‌గిల్డాపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

నెన్నెల, సెప్టెంబరు 24: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మైలారం నుంచి ముత్తాపూర్ పశువులు తరలిస్తున్నట్లు అందిన పక్కా సమాచారంతో జోగాపూర్ టీ రోడ్ వద్ద టీఎస్ 03 యూసీ 4551 వాహనాన్ని పట్టుకున్నామని పేర్కొన్నారు. వాహనంలో నాలుగు ఆవులు, నాలుగు ఎడ్లను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వరంగల్ జిల్లాకు చెందిన డ్రైవర్ గట్టికొప్పుల నాగరాజు, క్లీనర్ మహమ్మద్ ఇస్మాయిల్, కన్నెపల్లి మండలం ముత్తాపూర్‌కు చెందిన మహమ్మద్ రియాసత్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. పశువులను గోసంరక్షణ కేంద్రానికి తరలించామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

ప్రైవేట్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

గర్మిళ్ల, సెప్టెంబరు 24: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న నారాయణ స్కూల్‌పై చర్యలు తీసుకుని గుర్తింపు రద్దు చేయాలని డీఈవోకు మంగళవారం ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. జిల్లా కేంద్రంలోని సర్వే నెంబరు 61లో శ్రీచైతన్య జూనియర్ కళాశాల భవనంలో నారాయణ స్కూల్ నడిపిస్తున్నారని, స్కూల్‌ను 2020 తర్వాత అనుమతులు లేకుండా ఏర్పాటు చేశారని, ఐఎస్ఎంఎస్‌లో 2004లో అనుమతి పొందినట్లుగా ఉందని తెలిపారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. బచ్చలి ప్రవీణ్‌కుమార్, జాగిరి రాజేష్, షేక్‌సల్మాన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బెదిరింపు రాజకీయాలు మానుకోవాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్


మాట్లాడుతున్న రఘునాథ్ వెరబెల్లి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24: మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు బీజేపీ నాయకులపై చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలు మానుకోకపోతే డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి, పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించాలన్నారు. కాంగ్రెస్ పార్టీలో భూ కబ్జాదారులే భూ ఆక్రమణల గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు హైద్రాబాద్ కాప్రాలో పేదల భూములు కబ్జా చేశారని, ఆ బాధితులు చేస్తున్న ఆరోపణలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైద్రాబాద్ చెరువుల్లో బఫర్ జోన్‌లలో ఇండ్లు కట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న భూ ఆక్రమణల జాబితా తెప్పించుకుని ఆక్రమణలు చేసిన కాంగ్రెస్ నాయకుల ఇండ్లు కూలగొట్టాలని డిమాండ్ చేశారు. భూ కబ్జాలు చేసిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో చేరగానే నీతిమంతులయ్యారా అని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకులపై బెదిరింపుల చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు బీజేపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదన్నారు. పురుషోత్తం, వెంకటేశ్వర్‌రావు, తిరుపతి, శ్రీనివాస్, లచ్చన్న, రాంచందర్, మల్లేష్, రాజు, అశ్విన్, సదానందం, మధు రెన్వా, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం

● మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 24: ఎన్నికల సమయంలో తనను చంపేందుకు సుపారీ ఇచ్చి మనుషులను తెప్పించారని, నియోజకవర్గంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు కొమ్ముకాస్తున్నారంటూ ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు చేసిన ఆరోపణలు అవాస్తవమని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. దివాకర్‌రావు మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు, భూకబ్జాలకు పాల్పడే ప్రేంసాగర్‌రావు తమపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదమని, కబ్జాకోరు ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్నికల సమయంలో హైదబాద్‌లోని కప్రాకు చెందిన ప్రేంసాగర్‌రావు బాధితులు ఆందోళనకు దిగిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. డీకొండ అన్నయ్యకు నోటీసు జారీ చేయకుండానే భవనాన్ని కూల్చారని అన్నారు. భూకబ్జాలపై మాట్లాడే ఎమ్మెల్యే 324 సర్వేనెంబర్‌లోని 57 ఎకరాల భూమిని రికవరీ చేయాలని సవాలు చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చి అక్కడ ఆసుపత్రి కడుతామని ఎమ్మెల్యే చెప్తున్నారని, నిర్మాణాలు చేపట్టడం వదిలేసి కూల్చడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గంజాయి సంస్కృతిని పెంచి పోషిస్తున్నది ఎవరో అందరికి తెలుసన్నారు. తమ వర్గానికి చెందిన నాయకులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, తమపై కూడా తప్పుడు కేసులు పెట్టించేందుకు యత్నిస్తున్నారన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని సరైన సమయంలో గుణపాఠం చెప్తారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదే సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, నాయకులు విజిత్‌రావు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

బెల్లంపల్లి, సెప్టెంబరు 24: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. బెల్లంపల్లి, తాండూర్ ప్రజలకు గోదావరి నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. క్యాంపు కార్యాలయంలోనే అందుబాటులో ఉంటానని సూచించారు. నాయకులు కొక్కిరాల చంద్రశేఖర్, రత్నం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వినోద్ అన్నారు. వంద పడకల ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్, ఓపీ, ఫార్మా విభాగాన్ని పరిశీలించారు. వైద్యం ఎలా అందుతుందని రోగులను తెలుసుకున్నారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కౌన్సిలర్ బండి ప్రభాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి పాల్గొన్నారు.

తాండూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కు లతోపాటు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో రూ.6.65 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మండల ప్రజలకు ఎల్లంపల్లి నుంచి తాగునీరు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా మక్కాయాత్రకు వెళ్తున్న సందర్భంగా ఆయనను ఎమ్మెల్యే గడ్డం వినోద్‌వెంకటస్వామి సన్మానించారు. మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్ పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో వైద్యసేవలు పునఃప్రారంభం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 24 : పట్టణం లోని గోదావరి నది సమీపంలోని మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)లో వైద్యసేవలు మంగళవారం నుంచి తిరిగి పునఃప్రారంభమయ్యాయి. వరద ముంపు కారణంగా ఈ నెల 2వ తేదీన ఎంసీ హెచ్‌ను మూసివేసి రోగులను ఐబీ ప్రాంతంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. వర్షాలు లేకపోవడం, గోదావరి నదిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఆసుపత్రిని తిరిగి తెరవడంతో పాటు వైద్య సేవలను ఆరంభించారు. ఈ విషయమై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డిని వివరణ కోరగా ఎంసీహెచ్‌లో వైద్యసేవలను పునఃప్రారంభిస్తామని, పేషెంట్లను జీజీహెచ్ నుంచి ఎంసీహెచ్‌కు తరలించామని, పీడియాట్రిక్ విభాగాన్ని ఎంసీహెచ్‌కే మార్చినట్లు ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

మందమర్రిటౌన్, సెప్టెంబరు 24: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. గడ్డి, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాలను, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. రాజేశ్వర్ రెడ్డి, వెంకటరమణ, ప్రభాకర్, శ్రీనివాసులు, శ్యాంసుందర్, జయప్రకాష్, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

మందమర్రిరూరల్, సెప్టెంబరు 24: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఆలిండియా స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు బచ్చలి అభిరామ్, జిలకర సిద్దార్థలు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద వారు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే ఫీజురియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా దినోత్సవం

మంచిర్యాల అర్బన్, సెప్టెంబర్ 24 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో జాతీయ సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్రపాణి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అనేది సమాజంలో యువత పాత్ర, నాయకత్వ లక్షణాల గురించి వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్.నరేందర్ రెడ్డి, స్టాఫ్ సెక్రటరి గోపాలకృష్ణ, కోఆర్డినేటర్లు ఎం.కుమారస్వామి, కె.రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని గోదావరి నదీ తీరంలో వినాయక నిమజ్జనంలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని వివేకవర్ధిని డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తొలగించారు. అనంతరం డ్రగ్స్‌పై రూపొందించిన షార్ట్‌ఫిలింను విడుదల చేశారు. జిల్లా కన్వీనర్ డాక్టర్ చంద్రమోహన్ గౌడ్, కళాశాల ప్రోగ్రామ్ అధికారి షరీనా బేగం, అధ్యాపకులు తిరుమల, రాజేష్, వంశీ, వాలంటీర్లు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో రామయ్యలు కేక్ కట్ చేశారు.


కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కూరగాయల మార్కెట్ ఎదుట వ్యాపారుల ఆందోళన

బెల్లంపల్లి, సెప్టెంబరు 24: పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద నిర్మించిన కూరగాయల మార్కెట్ సముదాయాన్ని బుధవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. 108 స్టాళ్లకుగాను 75 మంది రూ.10 వేల చొప్పున డిపాజిట్‌లు చెల్లించారని తెలిపారు. మార్కెట్ ప్రారంభించిన తర్వాత రోడ్డు మీద కూరగాయలు విక్రయించవద్దని, విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కూరగాయల వ్యాపారస్తులు మంగళవారంరాత్రి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆర్థిక ఇబ్బందులతో డిపాజిట్ చెల్లించలేదని, అందరు డిపాజిట్ చెల్లించిన తర్వాత డ్రా ద్వారా కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రారంభం మాత్రమే చేస్తామని, ఒకేసారి అందరికి డ్రా తీస్తామని హామీ ఇచ్చారు.

ఇద్దరికి గాయాలు

బెజ్జూరు, సెప్టెంబరు 24: బైక్ అదుపు తప్పి పడిపోయిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పాపన్నపేట గ్రామానికి చెందిన బుజూడి సంతోష్, శివ బిశ్వాస్ మంగళ వారం రాత్రి కాగజ్‌నగర్ నుంచి బెజ్జూరుకు వస్తున్న క్రమంలో నాగులమ్మ వద్ద బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో బైక్‌పై ఉన్న సంతోష్‌కు తీవ్ర గాయాల య్యాయి. శివ బిశ్వాస్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలైన సంతోష్‌ను కాగజ్‌నగర్‌కు తరలించారు. స్వల్ప గాయాలైన శివ బిశ్వాస్‌ను బెజ్జూరు పీహెచ్‌సీకి తరలించారు.

ఉద్యోగాలపై అవగాహన

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 24: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్మీ, ఎయిర్స్ ఫోర్సు ఉద్యోగాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయ్‌మెంటు అధికారి రవి కృష్ణ మాట్లాడుతూ ఆర్మీ, ఎయిర్ ఫోర్సు ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దేశ రక్షణలో భాగంగా ఇటీవల అగ్ని వీర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండియన్ ఎయిర్ ఫోర్సు అధికారులు సందీప్, జీనా, కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి దత్తాత్రీ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

వాంకిడి, సెప్టెంబరు 24: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డీఎల్‌పీవో ఒమర్‌హుస్సేన్ అన్నారు. ఎంపీ డీవో కార్యాలయంలో మంగళవారం మిషన్ భగీరథ సహాకులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాటాడారు. మంచి నీటి సరఫరా నీటి నాణ్యత, చేతిపంపుల మరమ్మతులు, పైపులైన్ మరమ్మతులు, చేస్తూ నీటిసరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో అజీజుద్దీన్, డీఈ ఇర్ఫాన్ అహ్మద్ పాల్గొన్నారు.

కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 24: కాగజ్‌నగర్ కాపువాడకు చెందిన సీనియర్ కార్యకర్త రాజన్నకు ఇటీవల కాలుకు ఆపరేషన్ కావటంతో మంగళవారం రాజన్న ఇంటికి మాజీ ఎమ్మెల్యే కోనప్ప వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కౌన్సిలర్ జయచందర్ ఉన్నారు.

తహసీల్దార్ ఎదుట ఒకరి బైండోవర్

సిర్పూర్(టి), సెప్టెంబరు 24: సిర్పూర్(టి) మండల కేంద్రంలోని నాగమ్మ చెరువు శిఖం భూమిని కబ్జా చేసి అక్రమంగా టేలా వేయడానికి ప్రయత్నించిన షేక్ అమాన్‌ను మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఎవరు కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేయవద్దని సూచించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కౌటాల, సెప్టెంబరు 24: పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఆసిఫాబాద్ సర్కిల్ ఏవో ఈశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని క్యాటగిరి 2లో బకాయిలు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులతో మంగళవారం మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట కాగజ్‌నగర్‌ఏఈ, ఈఆర్‌ఓ రాజమల్లు, ఏఈఈ రవీందర్, ఫోర్‌మెన్ రమేష్, జెఎల్ఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులు ఎత్తివేయాలి


రాస్తారోకో చేస్తున్న కోసిన గ్రామస్థులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 24: కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన బెల్టు షాపులను వెంటనే ఎత్తివేయాలని మంగళవారం గ్రామస్తులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారని వాపోయారు. దీంతో యువకులు మద్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. మద్యం తాగి వాహనాలు కూడా నడిపిస్తుండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకొని ఎస్సై మహేందర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మద్యం బెల్టు షాపులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

రెబ్బెన, సెప్టెంబరు 24: రెబ్బెన గోలేటి సీహెచ్‌పీ వద్ద మంగళవారం అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీలు చేస్తుండగా, ఆసిఫాబాద్ నుంచి బెల్లంపల్లి వైపు వెళుతున్న వాహనంలో అనుమతులు లేకుండా తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకొని మెస్రం ప్రతిక్, ఎస్‌కె ఆసీఫ్, సులేమాన్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పశువులను అక్రమంగా తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 24: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలమైందని దీనికి నిదర్శనమే జైనూరు సంఘటన అని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు సరస్వతీ, కుమరం భీం మను మడు సోనేరావు, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి పోచయ్యలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జైనూరు ఘటనకు సంబంధించి ఉట్నూర్‌లో నిర్వహించిన ఆదివాసీ సంగాల సమావేశానికి మంత్రి సీతక్క తనకు సమాచారం ఇవ్వక పోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆదివాసీ మహిళలకు న్యాయం చేయాలని, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జైనూరులో 144 సెక్షన్ కొనసాగుతుంతడడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

- మెరుగైన విద్యను అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. పార్టీ నాయకులతో కలసి మెడికల్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సతీష్‌తో మాట్లాడి విద్యార్థులను అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆదివారం వెనుకబడిన ప్రాంత అభివృద్ధి చెందాలని ఉద్దేశ్యంతో జిల్లాకు మెడికల్ కళాశాలను తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అయితే విద్యార్థులకు ప్రొఫెసర్ల నియమకంలో కూడా ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోక పోవడం బాధకరమ్నారు. ఇప్పటికైనా మెడికల్ కళాశాలపై దృష్టి సారించాలని కోరారు. తుడుందెబ్బ నాయకుడు పోచయ్య, నాయకులు సరస్వతీ పాల్గొన్నారు.

మహిళపై దాడి చేసిన పలువురిపై కేసు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 24: కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఓ మహిళపై కొంత మంది వ్యక్తులు దాడి చేసిందులకు పలువురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ శంకరయ్య తెలిపారు. పట్టణానికి చెందిన మహిళకు చెందిన వ్యక్తిగత వీడియోలు ఫోన్ నుంచి తొలగించాలని నాయకపు శివగౌడ్‌ను కోరాడని, ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకొని నాయకపు శివగౌడ్‌తో పాటు పలువురు కలిసి దాడి చేసినట్టు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నాయకపు శివగౌడ్, నవీన్‌గౌడ్, భరత్, అవినాష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించామని చెప్పారు. వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేసిన మరో సంఘటనలో తూడురు ఈశ్వర్, శైలజపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్టు తెలిపారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ రామానుజం

కౌటాల, సెప్టెంబరు 24: ఎక్కడైనా మైనర్ బాలికలు, విద్యార్థులు, మహిళలను వేధించినా, లైంగిక దాడులకు పాల్పడినా వారిపై చట్ట రీత్యా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ రామానుజం తెలిపారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చింతలమానేపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై ఈ నెల 22న అదే గ్రామానికి చెందిన 27 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి లైంగిక దాడి చేశాడని చెప్పారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమో దు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.. ఆయన వెంట సీఐ రమేశ్, ఎస్సైలు మధుకర్, నరేష్ ఉన్నారు.

ఎస్పీఎం కాలుష్యంతో ఇబ్బందులు

● గేటు ఎదుట కాలనీవాసుల నిరసన


గేటు ఎదుట నిరసన తెలియచేస్తున్న కాలనీవాసులు

కాగజ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 24: ఎస్పీఎంనుంచి వెలువడుతున్న కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని సమీప ప్రాంతాల కాలనీవాసులు మంగళవారం సాయంత్రం ఫ్యాక్టరీ గేటు ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పలువురు మాట్లాడుతూ తమ కాలనీల్లోకి ఎస్పీఎం పొగ నేరుగా వస్తోందని, దీంతో భరించ లేని వాసనతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గతంలో అధికారులకు కూడా వివరించినట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలుష్యం లేకుండా చూడాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎస్పీఎం ప్రతినిధి రమేశ్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ ఖయ్యాం, సాయి, వాజీత్, ఆసీఫ్, ఖాలీక్, ఫైజాన్, నిసార్, సాంబయ్య, లక్ష్మి, శకుంతల, నిర్మల, సారిక, రాజేశ్వరి, సునిత, తారాబాయి పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

ఆసిఫాబాద్ రూరల్, సెప్టెంబరు 24: పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది స్వర్ణోత్సవ సభ పోస్టర్లను మంగళవారం జిల్లా కేంద్రంలోని మాతృశ్రీ కళాశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో .వేణు, తిరుపతి, శ్రీకాంత్, విలాస్, హరిశ్చంద్రప్రసాద్, సాయికుమార్, అంజలి, అశ్విని, సునీత, కవిత, సందీప్, చరణ్, అంజన్న, మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ దినోత్సవం

వాంకిడి, సెప్టెంబరు 24: వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాట్ మీ బట్ యు అనే నినాదంతో సమాజం సంక్షేమం కోసం జాతీయ సేవా కోసం పాటు పడాలని ప్రిన్సిపాల్ సురేందర్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్, రాజమౌళి, శ్రీధర్, కిరణ్‌కుమార్, తిరుపతి, సంతోష్ పాల్గొన్నారు.

నాలుగు కాళ్ల కోడి పిల్ల


నాలుగు కాళ్లతో పుట్టిన కోడి పిల్ల

పెంచికలపేట, సెప్టెంబరు 24: మండలంలో నాలుగు కాళ్లతో జన్మించిన ఓ కోడి పిల్ల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కొండపల్లి గ్రామానికి చెందిన చౌదరి గంగయ్య అనే రైతు తన ఇంట్లో కొంత కాలంగా కోళ్లను పెంచుతున్నాడు. మూడు రోజుల క్రితం ఓ కోడి పెట్టిన గుడ్లను పొదిగేశాడు. తొమ్మిది పిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఒక కోడి పిల్ల నాలుగు కాళ్లతో పుట్టింది. ఆరోగ్యంగా ఉన్న ఈ కోడి పిల్లను చూసేందుకు గ్రామస్థులు తరలివస్తున్నారు. ఈ విషయంపై మండల పశువైద్యాధికారి రాకేష్‌ను వివరణ కోరగా జన్యు లోపం కారణంగా నాలుగు కాళ్లతో కోడి పిల్లలు అరుదుగా పుడతాయని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
బుధవారం 25 సెప్టెంబరు 2024





పరిహారం కోసం ఎదురుచూపులు

- జిల్లాలో నీటిపాలైన 543 ఎకరాలు
- నెల రోజులు కావస్తున్నా పైసా విదల్చని ప్రభుత్వం
- నష్టం అంచనా రిపోర్టు ప్రభుత్వానికి అందజేత

పెట్టుబడి నీటి పాలు

జిల్లాలోని పత్తి, వరి, ఇతర పంటలు సాగు చేసిన రైతన్నలకు తీరని నష్టం వాటిల్లింది. పంట సాగు సమ యంలో ఎకరాకు రూ.40 వేలు వెచ్చించినట్లు రైతులు తెలిపారు. భూములు దున్నడం మొదలుకొని విత్తనాలు వేయడం ఎరువులు, కలుపు తీయడం, కూలీలకు వెచ్చించారు. సకాలంలో వర్షాలు కురవడంతో ముఖ్యంగా పత్తి పంటపై రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. అయితే అతివృష్టి కారణంగా వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. పంట మొత్తం తుడిచి పెట్టుకుపోవడంతో రెక్కల కష్టం కూడా మిగలక పోగా, సాగు కోసం చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు.

నెల రోజులు కావస్తున్నా అందని పరిహారం

భారీ వర్షాల కారణంగా వివిధ రకాల పంటల నష్టాన్ని అంచనా వేసిన అధికారులు రెండు వారాల క్రితం తుది నివేదికను ప్రభుత్వానికి అందజే శారు. క్షేత్రస్థాయిలో పంట చేలను సందర్శించి నష్టం వివరాలను సేకరించారు. జిల్లా వ్యాప్తంగా గోదావరి పరి వాహక ప్రాంతాలైన మంచి ర్యాల, చెన్నూరు నియోజకవర్గాల్లో నష్టం అపారంగా ఉంది. అయితే నెల రోజులు గడుస్తున్నా పరిహారం అందకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

మంచిర్యాల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యం కారణంగా అన్నదాతకు నష్టం వాటిల్లగా ప్రభుత్వపరంగా సాయం అందించడంలో జాప్యం జరుగుతోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో పంట నీటి పాలుకావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వేలకు వేలు అప్పు చేసి పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట మొలక దశలోనే నీట మునగడంతో కనీసం పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా ఏపుగా పెరిగిన పత్తి పంటకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది.

జిల్లాలో నీట మునిగిన పంట

భారీ వర్షాల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో ప్రధానంగా 393 మందికి రైతులకు చెందిన పత్తి, వరి పంటలు 543 ఎకరాల్లో నీట మునిగినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనాకు వచ్చారు. జన్నారం మండలం తొమ్మిది గ్రామాల్లోని 167 మంది రైతులకు చెందిన మొత్తం 171 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. చెన్నూరు మండలంలోని ఆరు గ్రామాల్లో 60 మందికి చెందిన 127 ఎకరాల పంట పూర్తిగా నీటిపాలైంది. జైపూర్ మండలంలోని నాలుగు గ్రామాల్లో 40 మంది రైతులకు చెందిన వందల ఎకరాల్లో పంట ధ్వంసమైంది. హాజీ పూర్ మండలంలో రెండు గ్రామాల్లోని 39 మంది రైతులకు చెందిన 89 ఎకరాల పంట నీటిపాలు అయింది. నస్పూర్ మండలంలోని ఒక గ్రామంలో 19 మంది రైతులకు చెందిన 41 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. మంచిర్యాల మండలానికి సంబంధించి రెండు గ్రామాల్లో 39 మంది రైతులకు చెందిన 89 ఎకరాల పంట నీట మునిగింది.

పంట నష్టం వివరాలు ఇలా

వ్యవసాయ అధికారులు పంట నష్టం అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. జన్నారం మండలంలో 129 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లగా, 43 ఎకరాల్లో పత్తి పంట, ఏడు ఎకరాల్లో కందికి నష్టం వాటిల్లింది. హాజీపూర్ మండలంలో 43 ఎకరాల్లో పత్తి, 28 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. మంచిర్యాల మండలంలో 80 ఎకరాల్లో పత్తి, మూడు ఎకరాల్లో వరి నీటి పాలైంది. నస్పూర్ మండలంలో తొమ్మిది ఎకరాల్లో పత్తి, 23 ఎకరాల్లో వరి నీట మునిగింది. జైపూర్ మండలంలో వంద ఎకరాల్లో పత్తి, చెన్నూరు మండలంలో 90 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగింది.

ప్రభుత్వంపైనే ఆశలు...

వర్షాలతో ఊహించని విధంగా నష్టం వాటిల్లడంతో ప్రభుత్వంపైనే భారం వేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రైతులు నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు నష్టపరిహారం చేతికి అందినా కనీసం పెట్టుబడులు తిరిగొస్తాయన్న ఆశతో ఉన్నారు. ఇన్ని రోజులూ నష్టం అంచనా నివేదిక తయారీలో జాప్యం జరుగగా, ప్రస్తుతం పరిహారం అందించడంలోనూ ప్రభుత్వం తాత్సారం చేస్తుండటంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు. త్వరగా పరిహారం అందించాలని బాధిత రైతుల కోరుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక అందజేశాం

: సురేఖ, వ్యవసాయశాఖ జిల్లా అధికారి

భారీ వర్షాల కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టం అంచనా తుది రిపోర్టును కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి అందజేశాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు పంట నష్టం పరిహారం అందే అవకాశాలు ఉన్నాయి.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



తాళ్ళపేటలో బతుకమ్మ చీరలను అందజేస్తున్న చైర్మన్ తిరుపతి, నాయకులు

దండేపల్లి, సెప్టెంబరు 24: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ చైర్మన్ కోట్నాక తిరుపతి అన్నారు. కొక్కిరాల రఘుపతిరావు చారిటబుల్ ట్రస్టు, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుసురేఖ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం పలు గ్రామాల్లో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. తిరుపతి మాట్లాడుతూ రెబ్బనపల్లిలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను మంజూరు చేశారన్నారు. సౌర విద్యుత్ ఉత్పత్తి పైలట్ ప్రాజెక్టుకు వెల్గనూర్ గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. రుక్మిణి, శ్రీసత్యశ్రీ, దాసరి ప్రేమ్‌చందు, వెంకటేశ్వర్లు, సతీష్, ప్రవీణరెడ్డి, నాగరాణి త్రిమూర్తి, శకుంతల, రాజేందర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారి మరమ్మతుకు నిధులు విడుదల



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చెన్నూరు/మందమర్రి టౌన్, సెప్టెంబరు 24: కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ ఘట్కరిని మంగళవారం పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే వివేక్‌లు ఆయన కార్యాలయంలో కలిశారు. ముందుగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌హెచ్ 63 జోడువాగు రోడ్డు మరమ్మతు లేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. స్పందించిన మంత్రి వంద కోట్ల 80 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

చెన్నూరు: నేషనల్ హైవే అభివృద్ధికి రూ.100 కోట్లు, భీమారంలో జోడు వాగుల మరమ్మతుకు రూ.1.80 కోట్లు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రధాని మోదీ చిత్రపటాలకు చెన్నూరులో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

27న ఉద్యోగ మేళా

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 27న ఉదయం 9.30 గంటలకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు ఉద్యోగమేళా నిర్వహిస్తున్నారని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 2023, 2024 సంవత్సరాల్లో సీఈసీ, బీపీసీ, ఒకేషనల్ గ్రూపుల్లో 75 శాతం మార్కులతో పాసైన వారు సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 7569177071లో సంప్రదించాలన్నారు.

మహనీయుల జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 24: కలెక్టరేట్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 26న చాకలి ఐలమ్మ, 27న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీ

గర్మిళ్ల, సెప్టెంబరు 24: జిల్లాలో కేజీబీవీలో ఖాళీ పోస్టుల భర్తీ చేయనున్నట్లు డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ ఆఫీసర్లు 2, సీఆర్‌టీలు 2, పీజీసీఆర్‌టీ 7 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని సైన్స్ కేంద్రంలో ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

జీవనోపాధి కోల్పోతున్నాం ఆదుకోండి

భీమారం, సెప్టెంబరు 24: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల ఊర చెరువును ఆనుకుని టేలాలు ఏర్పాటు చేసుకుని 30 సంవత్సరాలుగా జీవిస్తున్నామని షాపుల యజమానులు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ టైలరింగ్, చెప్పుల షాపులు, బార్బర్, ఎలక్ట్రానిక్, వైండింగ్ తదితర షాపులను ఏర్పాటు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. అధికారులు ఊర చెరువు హద్దులు ఏర్పాటు చేయడంతో రెవెన్యూ అధికారులు నోటీసులు అందించారని తెలిపారు. తమ షాపులుపోతే రోడ్డున పడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. లచ్చన్న, రాములు, మల్లయ్య, రాజబాబు, సత్యనారాయణ, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో స్వచ్ఛతాహీ సేవ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛతాహి సేవా-2024ను నస్పూర్ మున్సిపాలిటీలోని 9వ వార్డులో మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బంది ఆధ్వర్యంలో వార్డు ప్రజల భాగస్వామ్యంతో ఖాళీ స్థలాల్లో మొక్కలు, చెత్తాచెదారం తొలగించి, పబ్లిక్ టాయిలెట్‌ను శుభ్రం చేశారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ధరల దడ

- నిత్యావసరాల ధరలు పైపైకి...
- ఉల్లిగడ్డ రూ.60, వెల్లుల్లి-రూ. 400
- పెరిగిన వంట నూనె ధరలు



నస్పూర్, సెప్టెంబరు 24 : పెరుగుతున్న ధరలు సామాన్యులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల కారణంగా ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. పండగల ముందు నిత్యావసరాల ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజానీకానికి చుక్కలను చూపుతున్నాయి. పది రోజులుగా మార్కెట్‌లో వంట నూనెల ధరలు పెరిగాయి. కేంద్రం దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు పెంచడంతో పండగల ముందు నూనె ధరలు ఒక్కసారిగా పెరుగుదల మొదలైంది. నూనె ప్యాకెట్ రూ. 110 నుంచి 115 ఉండగా ప్రస్తుతం రూ 130 నుంచి 140 వరకు చేరిం ది. 15 లీటర్ల నూనె డబ్బా రూ. 1600 నుంచి 1650 ఉండగా ప్రస్తుతం రూ. 1850కి లభిస్తోంది.

పండగల ముందు వంట నూనెల ధరలు పెరగడం వలన పిండి వంటలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా మార్కెట్‌లో కిలో వెల్లుల్లి రూ.400, అల్లం- రూ.180, ఉల్లిగడ్డ తెల్లవి రూ.60, ఎర్రవి రూ.55, టమాట కిలో రూ.50, చిక్కుడు రూ.100, ఆలసంత రూ.60, బెంకాయ రూ.50, కాకరకాయ రూ.80, సోరకాయ రూ.60, బీరకాయ రూ.80, మిర్చి రూ.60కి విక్రయిస్తున్నారు. ఇక కొత్తిమీర ధర దడపుట్టిస్తోంది. కిలో రూ.300లకు పైగా చేరింది. చిన్న కట్ట రూ.20కి విక్రయిస్తున్నారు. పెరిగిన ధరల కారణంగా సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను నియంత్రించి భారం తగ్గించాలని ప్రజలు కోరుతున్నారు.

వచ్చే నెల 9న లాభాల బోనస్

పండుగ అడ్వాన్సు రూ. 25వేలు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 24: సింగరేణి కార్మికులకు వచ్చే నెల 9న లాభాల బోనస్ చెల్లించనున్నట్లు సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో మాట్లాడారు. ఈ ఏడాది కూడా సింగరేణి కార్మికులకు దసరా పండుగ అడ్వాన్సుగా రూ.25 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రూ.95 కోట్లు కేటాయించామన్నారు. సెప్టెంబరు నెల వేతనంతో కలి పి అడ్వాన్సును కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సాధించిన లాభాల్లో 33 శాతం వాటాను సంస్థలో పని చేస్తున్న 42 వేల మంది ఉద్యోగులకు ఒక్కొక్కరికి లక్ష 90 వేల చొప్పన అందించనున్నామని తెలిపారు. అలాగే సింగరేణిలో పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5 వేల చొప్పున లాభాల వాటా చెల్లించేందుకు విధి విధానాలు రూపొందిస్తున్నామన్నారు. వివిధ కాంట్రాక్టర్ల వద్ద గత ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన వారి వివరాలు సేకరించాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పండుగకు ముందే వారికి కూడా లాభాల బోనస్ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. లాభాల వాటా, పండుగ అడ్వాన్సు రూపేణా మొత్తం రూ.900 కోట్లను ఉద్యోగులకు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని సీఎండీ అధికారులను ఆదేశించారు.

హైద్రాబాద్‌కు తరలి వెళ్లిన రేషన్ డీలర్లు

భీమారం, సెప్టెంబరు 24 : రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని మండలంలోని 13 మంది రేషన్ డీలర్లు చలో హైద్రాబాద్ కార్యక్రమానికి మంగళవారం తరలి వెళ్లారు. డీలర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు రూ.5 వేల వేతనంతో పాటు రూ. 300 కమీషన్ ఇస్తానని చెప్పి ఇప్పటికి 9 నెలలయినా అమలు చేయలేదన్నారు. శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

కలెక్టర్ కుమార్‌దీపక్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట, సెప్టెంబరు 24: గిరిజన గ్రామాల్లో జ్వరాలు ప్రబలకుండా నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం కాసిపేట పీహెచ్‌సీని సందర్శించి వైద్యులు, రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. జ్వరపీడిత గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. పారిశుధ్య కార్మికులను సమన్వయం చేసుకుంటూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. డీఎల్‌పీవో ఎస్‌కె సప్దర్ ఆలీ, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, వైద్యాధికారి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలను కలెక్టర్ కుమార్ దీపక్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న బోధనపై ఉపాధ్యాయులను ఆరా తీశారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో రూ. 8 లక్షలతో భవనం నిర్మించేందుకు ప్రతిపాదన పంపాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో మహేందర్, ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఏఈ వినయ్ , ఉపాధ్యాయులు ఉన్నారు.

కలెక్టర్ ఉపాధ్యాయుడైన వేళ...

కాసిపేట: కలెక్టర్ కుమార్ దీపక్ ఉపాధ్యాయుడిగా మారారు. మంగళవారం సోనాపూర్ గట్రావుపల్లి, నాయకపుగూడ మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. బోర్డుపై రాసిన అక్షరాలను విద్యార్థులతో చదివించి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంపల్లి: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మంగళవారం కలెక్టర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో భాగంగా శుద్ధమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నూతన పీహెచ్‌సీల ఏర్పాటుకు స్థలాలను గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. ఎల్లంపల్లి నుంచి బెల్లంపల్లి వరకు తాగునీటి ప్రాజెక్టులో భాగంగా నీటి సరఫరా సంబంధిత సర్వే పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీటీ రోడ్డు, సీసీ రోడ్లు, అంతర్గత రహదారుల పూర్తి వివరాలతో నివేదికలు రూపొందించాలని సూచించారు. తాండూర్, కాసిపేట రహదారులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.



సోనాపూర్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్‌కుమార్ దీపక్

సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎలక్టోరల్ అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, జాబితా మార్పులు, చేర్పులకు అందిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. నోడల్ అధికారులు, సహాయకులకు, ఎన్నికల అధికారులకు ఈనెల 26, 27 తేదీల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ఇంటింటా సర్వే ప్రక్రియ కొన సాగుతుందని, హేతుబద్ధీకరణలో భాగంగా పోలింగ్ కేంద్రాల మార్పులు, నూతన పోలింగ్ కేంద్రాల గుర్తింపు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, చంద్రకళ, తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి : సీపీ

భీమిని, సెప్టెంబరు 24: నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజల రక్షణ కోసం పాటుపడాలని రామగుండం సీపీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రిసెప్షన్ కౌంటర్, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రజారక్షణ కోసం పాటుపడాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సీఐ కుమార స్వామి, ఎస్సై విజయ్ కుమార్, ఏఎస్సై తిరుపతి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కన్నెపల్లి: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌ను సీపీ శ్రీనివాస్ తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు, విధుల పనితీరు, స్టేషన్ భౌగోళిక పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి న్యాయం చేయాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్ర మాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్ఐలు సౌజన్య, కిరణ్, విజయ్‌కుమార్, గంగారాం పాల్గొన్నారు.



భీమినిలో రికార్డులు పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

తాండూర్: బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందనే నమ్మకం కల్పించాలని సీపీ శ్రీనివాస్ పోలీస్ సిబ్బందికి సూచించారు. తాండూర్, మాదారం పోలీస్‌స్టేషన్‌లను తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామాల్లో రౌడీషీటర్స్, కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌షీట్స్‌ల ఇళ్లను తనిఖీ చేయాలన్నారు. సీఐ కుమారస్వామి, ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య ఉన్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న బెల్లంపల్లి ఎస్‌హెచ్‌వో



ఎస్‌హెచ్‌వో దేవయ్య

బెల్లంపల్లి, సెప్టెంబరు 24: రాష్ట్రస్థాయిలో బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టంలో ప్రజలకు సత్వర సేవలు అందించడంతోపాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించడం, భరోసా కల్పించినందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన పది పోలీస్‌స్టేషన్‌లలో బెల్లంపల్లి ఎస్‌హెచ్‌వో దేవయ్యకు మూడవస్థానం లభించింది. హైద్రాబాద్ నుంచి స్టేషన్‌కు వచ్చిన బాధితులకు ఫోన్ చేసి వారు చెప్పిన సమాధానాల ఆధారంగా ఎంపిక చేశారు.సీపీ శ్రీనివాస్, ఏసీపీ రవికుమార్ అభినందించారు.

అందుబాటు ధరలో విద్యుత్ ఉపకరణాలు

గర్మిళ్ల, సెప్టెంబరు 24: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు తక్కువ ధరలో అందుబాటులో ఉన్నాయని సర్కిల్ సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్‌లు, ఇండక్షన్ స్టవ్, ఫ్యాన్లు లభిస్తా యన్నారు. వినియోగదారులు www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో కొనుగోలు చేయవచ్చని తెలిపారు.